
# అక్తర్ అరెస్టు!

-నియాజి



రాత్రి నర్సింగ్ హోంనుంచి ఆలస్యంగా రావడంవల్ల కాబోలు పొద్దున్నే తస్లీమ్ లేపేంతవరకు పక్కమీద దొర్లుతూనే వున్నాను.

'వజీర్ నీ కోసం వచ్చి వెయిట్ చేస్తున్నాడు. వచ్చి పలకరించి వెళ్లండి' అని తస్లీమ్ నన్ను నిద్రలేపుతూ అంది.

సాధారణంగా వజీర్ ఈ సమయంలో ఇంటికిరాడు. అలాంటిది ఇంత పొద్దున్నే వచ్చాడంటే ఏదో ముఖ్యమైన విషయమే అయి వుంటుందనుకొని డ్రాయింగ్ రూమ్‌కు వెళ్లాను. వజీర్ గోడమీద గడియారం వంక నిర్లిప్తంగా చూస్తూ కూర్చున్నాడు.

'ఏం వజీర్ భాయ్! ఇంత పొద్దున్నే వచ్చావ్, ముఖ్యమైన పనేమైన వుందా?'

'అక్తర్‌ను పోలీసులు రాత్రి అరెస్ట్ చేశారు డాక్టర్ సాబ్!' వజీర్ సోఫా నుంచి లేస్తూ ఆందోళనగా చెప్పాడు.

నాకు ఒక్క క్షణం అర్థం కాలేదు. వెంటనే తేరుకొని-

'అక్తర్‌ను అరెస్ట్ చేయడమేమిటీ? కారణాలేమైనా తెలుసా?' ఆదుర్దాగా అడిగాను.

'పాకిస్థాన్‌కు మద్దతిస్తున్నాడని, ఉగ్రవాదులతో చేతులు కలిపాడనీ పోలీసుల అనుమానం.'

'అసలా అనుమానం ఎందుకొచ్చింది'

'సరిగ్గా చెప్పడం లేదు డాక్టర్. ప్రస్తుత ప్రపంచ పరిణామాలపై బహిరంగ వ్యాఖ్యలు చేశాడంట. అమెరికా చర్యను ఖండించాడట. ఇదే కారణమై వుంటుంది'

'ఇందులో నాకేమి తప్పుకనిపించడం లేదు. ఆ మాటకొస్తే అమెరికా వైఖరిని ప్రతి ఒక్కరు ఎండ గడతారు. సరే నేను లాయర్‌తో మాట్లాడతాను. అలాగే పోలీసు అధికారులను కూడా కలిసి అక్తర్ విడుదల కోసం ప్రయత్నిస్తాను. నువ్వేం కంగారు పడకు. అక్తర్ భార్య పిల్లలను కూడా ఆందోళన పడవద్దని చెప్పు' అని వజీర్‌ను పంపించాను.

వజీర్ వెళ్లిపోయిన తర్వాత మొహం కడుక్కొని కాసేపు జరిగిన విషయాన్ని తస్లీమాకు చెప్పాను. తస్లీమా కూడా ఆశ్చర్యానికి గురైంది. 'అక్తర్ భాయ్ అలాంటి వాడు కాదు కదండి, ఇందులో ఏదో పొరపాటు జరిగివుంటుంది' అని బేలగా అంది.

నిజమే కేవలం మతం ఆధారంగా అక్తర్‌ను అనుమానించడం ఎంత తప్పు. అక్తర్ గత పదేళ్లుగా నాకు తెలుసు. మంచి మనిషి. అతని పూర్వీకుల్లో కొందరు దేశ విభజన కాలంలో పాకిస్థాన్‌కు తరలి వెళ్లినా, అక్తర్ తాత జావెద్ మాత్రం భారత్‌ను వదల్లేదు. తాతలాగే అక్తర్‌కు కూడా పాక్ అంటే పరమ అసహ్యం. అలాంటిది అక్తర్ పాక్‌కు సహాయమందిస్తున్నాడనే విషయాన్ని నేను జీర్ణించుకోలేకపోయాను. మొన్నీ మధ్య నా దగ్గరకు వచ్చినపుడు కూడా అమెరికాకు సాయం అందిస్తున్నందుకు ముషారఫ్‌ను నోటి కొచ్చినట్టు తిట్టాడు. ఈ ఆలోచనలోనే పది గంటలప్పుడు లాయర్ సురేందర్‌కు ఫోన్ చేశాను.

'చాలారోజుల తర్వాత ఫోన్‌చేశారు. సంగతేమిటి డాక్టర్ అలి సాబ్' సురేందర్ అడిగిన ప్రశ్నకు మొత్తం జరిగిన విషయాన్ని వివరించాను. అక్తర్ ఎలాంటి వాడో కూడా వివరించి చెప్పాను.

'కంగారు పడాల్సిన పనిలేదు. నాకు వదిలేయండి. నేను చూసుకుంటాగా. నిశ్చింతంగా వుండండి' సురేందర్ ఇచ్చిన భరోసాతో మనసు కాస్త నెమ్మదించింది.

****    ****

నర్సింగ్ హోమ్‌కు వచ్చానే కాని, మనసు మాత్రం అల్లకల్లోలంగా వుంది. అక్తర్ అరెస్ట్ విషయమే తొలిచి వేస్తోంది. కేవలం ముస్లిం కావడంవల్ల మమ్మల్ని ఇలా అనుమానంగా చూడటం హృదయాన్ని కలిచి వేస్తుంది. మేము స్వేచ్ఛగా మా అభిప్రాయాలను చెప్పడంకూడా నేరమే అయితే ఎలా బతికేది. దేశ రాజకీయాలు మాట్లాడినా, ప్రపంచ పరిస్థితుల గురించి మాట్లాడినా తప్పే. చివరికి క్రీడలకు కూడా మతాన్ని పులుముతున్నారు. నాకు మొదటి నుంచి క్రికెట్ అంటే వల్లమాలిన అభిమానం. హైదరాబాద్ లీగ్ క్రికెట్ కూడా ఆడిన అనుభవం నాకుంది. తర్వాత చదువులో పడి క్రికెట్‌ను దూరం చేసుకున్నాను. ఇప్పటికీ క్రికెట్ మ్యాచ్ జరుగుతుందంటే టెలివిజన్ వదిలిపెట్టను. నాకు బ్రియన్ లారా, స్టీవ్ వాలు ఎంతిష్టమో, అక్రం కూడా అంతే ఇష్టం. అయితే లారా, స్టీవ్ పేర్లను పది మంది ముందు ప్రస్తావించినట్టుగా అక్రం పేరును చెప్పలేను. అక్రం నాకు చాలా ఇష్టమని చెబితే, ఎదుటి వారి కళ్లలో కనిపించే అనుమానపు చూపులు నన్నెంతో ఆవేదనకు గురి చేస్తాయి. పైగా వెస్టిండీస్, ఆస్ట్రేలియాలకు మనతో అనాది గా ఎలాంటి సంబంధమూ లేదు. పాకిస్థాన్ సంగతి అలా కాదు. కుటుంబంలో అన్నదమ్ములు విడిపోయినట్టుగానే మనమూ విడిపోయాం. అయినా పాక్‌తో భారత్ తలపడుతుందంటే నేను ఖచ్చితంగా నా దేశం గెలవాలనే ఆకాంక్షి స్తాను. అయితే ఇప్పుడు మాత్రం నేను క్రికెట్ గురించి మాట్లాడటం లేదు. మూడేళ్ల క్రిందట జరిగిన సంఘటన నన్ను పూర్తిగా మార్చి వేసింది. ఆ ఆటపై ఆసహ్యం కలిగేలా చేసింది.

****    ****

ఆ రోజు షార్జాలో భారత్-పాకిస్థాన్ మధ్య ఫైనల్ మ్యాచ్. వీలైనంత తొందరగా నర్సింగ్‌హోమ్ నుంచి బయట పడి మ్యాచ్ చూడాలనే హడావిడిలో వున్నాను.

'సార్ చాయ్ కావాలా?'

చంద్రం పిలుపుతో కేసు స్టడీ చేస్తున్న నేను 'కావాల'న్నట్టుగా తలూపాను.

ఫ్లాస్క్‌లోంచి చాయ్ కప్‌లో పోస్తూ 'మ్యాచ్ చూడ్డానికి వెళ్తున్నావా సాబ్, ఎవరు గెలుస్తారో చెప్పండి ' అంటూ ప్రశ్నించాడు చంద్రం.

'ఇంకెవరు గెలుస్తార్రా-ఇండియానే గెలుస్తుంది' అని నవ్వుతూ చెప్పాను.

చంద్రమంటే నాకు మొదటి నుంచి అభిమానం. మా ఇద్దరి మధ్య ఒక రకమైన చనువు కూడా వుంది.

'ఏమో సార్ నాకు మాత్రం పాకిస్థాన్ గెలుస్తుందనిపిస్తుంది. వాళ్లలో వున్న తెగింపు మనలో వుండదు సార్! కావాలంటే వంద రూపాయల బెట్. పాక్ కచ్చితంగా గెలుస్తుంది' తాగిన కప్‌ను బక్కెట్లో వేసుకుంటూ అన్నాడు చంద్రం.

పందేలు కాయడం నాకిష్టం లేకపోయినా సరదా కోసమే కదా అని 'సరేరా' అంటూ ఇంటికి బయల్దేరాను.

****    ****

ఫైనల్లో పాక్ గెలిచింది. నేను కొంత అసహనానికి లోనయ్యాను. మన ఆటగాళ్లను కాసేపు తిట్టుకుంటూనే నర్సింగ్ హోమ్‌లో అన్య మనస్కంగానే కూర్చున్నాను. మధ్యాహ్నం చంద్రం చాయ్ తీసుకొని వచ్చాడు.

'ఏం సార్! బెట్ ఓడిపోయారు. నేను చెప్పినట్టే పాక్ గెలిచింది. అయినా పాక్‌తో మనవాళ్లు ఎప్పుడు గెలవాలి సార్' అంటూ వంద రూపాయలకోసం చేతులు చాపాడు.

'సర్లేవోయ్ జరిగిందేదో జరిగింది. పందెం ప్రకారం నీ వంద నీకు ఇస్తాను. అంతే కాని తెలియని క్రికెట్ గురించి ఎక్కువ మాట్లాడకు' అని జేబులో వున్న వంద కాగితాల్లోంచి ఒకటి తీసి ఇచ్చాను.

'డబ్బులు నాకెందుకు సార్. దీంతో స్వీట్లు కొనుక్కొని వస్తాను' అన్నాడు చంద్రం.

'బెట్ గెలిచాక డబ్బులు నీవే అవుతాయి. వాటితో ఏం చేసుకుంటావో నీ ఇష్టం' అని ఇంటికి బయలుదేరాను.

రాత్రి ఎనిమిదిగంటలప్పుడు పోలీసులు వచ్చి తలుపు తట్టారు. హాస్పిటల్‌లో ఆత్మహత్య కేసు వచ్చిందనుకొని తలుపు తీశాను.

'డాక్టర్ గారూ! మీరు పాక్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. పై అధికారులకు తెలిస్తే అరెస్టు దాకా వెళ్లొచ్చు. మీరు కాస్త జాగ్రత్తగా వుంటే మంచిది' అని చెప్పారు.

పోలీసులు మా కాలనీ వాళ్లే కాబట్టి నా మీదవున్న గౌరవంతో విషయాన్ని రచ్చ చేయలేదు. జరిగిందేమిటో నాకు అర్థం కాలేదు. 'నేనేమి పాక్‌కు మద్దతుగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. మీరు పొరబడి వుంటారు' అని వినయంగా చెప్పాను.

'లేదు సార్! చంద్రం మీ పేరే ప్రస్తావించాడు. అందుకే మీ ఇంటికి వచ్చాం' అని చెప్పి కాసేపు పిచ్చాపాటి మాట్లాడి వెళ్లిపోయారు.

వెంటనే నేను జరిగిందేమిటో తెలుసుకుందామని నర్సింగ్‌హోమ్‌కు వెళ్లాను. బాయ్‌తో చంద్రాన్ని పిల్చుకు రమ్మని చెప్పి, మిగతా డాక్టర్ల వద్దకు వెళ్లాను. వారి మొహంలో కూడా కాస్త అనుమానపు ఛాయలు కనిపించాయి. ఎన్నడూ లేనిది అంటి ముట్టనట్టుగా వ్యవహరించారు. వారి ప్రవ ర్తన నాకు మరింత బాధను కలిగించింది.

ఇంతలో చంద్రం వచ్చాడు. కాస్త భయం భయంగానే నా ముందుకొచ్చి నిల్చున్నాడు.

'ఏం జరిగిందో చెప్పరా' అని చంద్రాన్ని దగ్గరకు తీసుకొని అడిగాను.

'నేనేం చేయలేదు సార్. నువ్విచ్చిన వంద రూపాయలతో స్వీట్లు కొని అందరికి ఇచ్చాను. స్వీట్లేందుకురా పంచుతున్నావని అడిగితే, క్రికెట్‌లో పాకిస్థాన్ గెలిచింది కదా, అలి సాబ్ డబ్బులిచ్చిండు. ఆ పైసలతో స్వీట్లు కొన్నానని చెప్పాను. తప్పాసార్' అంటూ అమాయకంగా ప్రశ్నించాడు.

చంద్రం చెప్పినదాంట్లో తప్పేమీ లేదు కాని, దాన్ని అర్థం చేసుకోవడంలోనే ఇబ్బంది వచ్చింది. జరిగిందేమిటో పూర్తిగా వివరిస్తే తప్ప నా దేశభక్తి ఏమిటో వీరికి అర్థం కాదని. మొదటి నుంచి-అంటే మా పందెం గురించి, నేను డబ్బులు ఇచ్చిన వైనం గురించి డాక్టర్లందరికి చెప్పాను.

అప్పటికీ వారు అర్థమైనట్టే మొహం పెట్టారు కాని, నా మీద అనుమానం మాత్రం చెదిరిపోలేదు. తర్వాత పోలీసు స్టేషన్‌కు చంద్రాన్ని కూడా తీసుకెళ్లి అసలు విషయం చెప్పించాను. ఇంటికొచ్చిన తర్వాత కూడా నేను చాలాసేపు ఆ విషయమే ఆలోచించాను. నా ఉనికి కూడా ప్రశ్నార్థకమైనందు కు బాధ కలిగింది. దేశభక్తిని చాటుకోవడానికి బారో మీటర్ వుంటే బాగుండనిపించింది.

****    ****

ఇక అప్పట్నుంచి క్రికెట్ అన్నా, క్రికెట్ మ్యాచ్‌లన్నా అసహ్యం పుట్టింది. ఆ తర్వాత నేను మళ్లీ క్రికెట్ మ్యాచ్‌లు చూడలేదు. క్రికెట్ వార్తలు చదవలేదు.